సాక్షి
వికారాబాద్
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



అభివృద్ధి 'కడా'కే పరిమితం

అభివృద్ధి విషయంలో జిల్లా వాసులకు నిరాశ తప్పడం లేదు. కేవలం కొడంగల్‌కే భారీ నిధులు కేటాయిస్తున్నారు. 8లో▸



సమైక్యతకు నిదర్శనం..

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు హిందూ ముస్లిం సమైక్యతకు నిదర్శనమని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. 8లో▸



మట్టి గణపతికే జై!

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో సైతం మార్పులు వస్తున్నాయి. మట్టి గణపతి విగ్రహాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్యం



బషీరాబాద్: మండలంలోని గొట్టిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 12 సంవత్సరాల పాటు తెలుగు టీచర్‌గా పని చేసిన కే సత్యం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జూన్‌లో పెద్దేముల్ మండలం కందనెల్లికి బదిలీపై వెళ్లారు. మణిపూసల కవితా ప్రక్రియతో ఆయన ప్రాచుర్యం పొందారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నేడు అవార్డుల ప్రదానం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 39 మందిని ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన జాబితాను బుధవారం డీఈఓ రేణుకాదేవి విడుదల చేశారు. ఇదే విషయాన్ని 'సాక్షి' బుధవారం ప్రచురించిన కథనం అక్షర సత్యమైంది. ఉపాధ్యాయుల వివరాలతో పాటు పాఠశాలల పేర్లతో ముందుగానే పాఠకులకు చేరవేసింది. పేపర్ క్లిపింగ్‌ను ఉపాధ్యాయులు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఈఓ రేణుకాదేవి, జిల్లా ఎమ్మెల్యేలు అవార్డులు ప్రదానం చేసి సన్మానించనున్నారు.

అందుబాటులో అన్ని మందులు



అనంతగిరి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్క, పాము, తేలు కాటుకు వ్యాక్సిన్ ఉందన్నారు. ఈ వ్యాక్సిన్ కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లరాదని సూచించారు. బీపీ, షుగర్ వ్యాధులకు కూడా మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీమన్నారాయణ

కొడంగల్ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 – 26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ విద్యాలయ కొడంగల్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీమన్నారాయణ తెలిపారు. సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. బుధవారం పట్టణంలోని విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థి ఫొటో, సంతకం, తండ్రి సంతకం, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల అధికారిచే జారీ చేసిన ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 18న పరీక్ష జరుగుతుందని తెలిపారు. అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 94909 75070, 94408 82496, 94417 81470, 94402 00220, 94931 82173కు కాల్ చేయాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రఫియా ఖానం, దోస్త్ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్‌రావు, రాంబాబు సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. దోస్త్ – 2024 స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 4నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

చెంచుల సంక్షేమానికే పీఎం జన్మాన్

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి

కుల్కచర్ల: చెంచుల అభ్యున్నతి కోసం వారి వివరాలు సేకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ఉన్న చెంచు కుటుంబాలతో ఆయన మాట్లాడారు. చెంచు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు పీఎం జన్మాన్ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా చెంచు కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, ఇళ్లు, బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి బాలవరలక్ష్మి పాల్గొన్నారు.

దాతల సహకారంతో..



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్

మర్పల్లి: బూచన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ పేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు చేయూతనిస్తున్నారు. తన సంపాదనలో కొంతమొత్తాన్ని సమాజ సేవకు వినియోగిస్తున్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు దుప్పట్లు, నోట్ బుక్స్, ఐడెంటిటీ కార్డులు అందించారు. టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందజేస్తూ, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు.

నేనున్నానంటూ..



విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు అందిస్తున్న శ్రీకాంత్

మర్పల్లి మండలం పట్లూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు తన సొంత డబ్బులతో టైలు, బెల్టు, ఐడీ కార్డులు అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా.. నేనున్నానంటూ చేయూతనిస్తున్నారు.

గుణాత్మక విద్యనందిస్తూ..

కేవలం పాఠ్య పుస్తకాలతోనే కాకుండా గుణాత్మక బోధన అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు బుద్దారం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సరోజ. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా, చదువుపై ఆసక్తి కలిగేలా వినూత్న తరహాలో పాఠలు చెబుతున్నారు. ప్రతిభ చూపిన వారికి సొంత డబ్బులతో బహుమతులు అందజేస్తూ వెన్నుతడుతున్నారు.

– పెద్దేముల్



బుద్దారం పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న సరోజ

విద్యార్థులు మెచ్చిన టీచరమ్మ..



జ్వరం వచ్చిన విద్యార్థితో ఆప్యాయంగా మాట్లాడుతున్న హెచ్‌ఎం భాగ్యమ్మ (ఫైల్)

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న భాగ్యమ్మ పేద విద్యార్థులకు ఆపద వచ్చిందంటే చాలు ఆదుకునేందుకు ముందు వరుసలో ఉంటారు. ఇటీవల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ప్రణీత్‌కుమార్ అనే విద్యార్థికి కడుపు నొప్పి వచ్చింది. తల్లిదండ్రులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించగా అపెండిక్స్ ఉందని ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న భాగ్యమ్మ వెంటనే స్పందించి రూ.18,500 ఆర్థిక సాయం చేశారు. గత ఏడాది కొత్తూరులో హెచ్‌ఎంగా పని చేస్తున్న సమయంలో పాఠశాలలో విద్యార్థులకు భోజనం తయారు చేసే వంట ఏజెన్సీ కింద పని చేసే చంద్రమ్మ భర్త అకాల మరణం చెందారు. నిరుపేద అయిన చంద్రమ్మకు హెచ్‌ఎం ఆర్థిక సాయం చేశారు. కొత్తూరు పాఠశాలలో చదువుతున్న శిరీష తండ్రి మృతి చెందగా రూ.18వేలు ఆర్థిక సహాయం అందించారు.

అందరూ మెచ్చే మాస్టారు


ఆ సారు చెబితే పిల్లలే కాదు పెద్దలు కూడా వింటారు. విద్యార్థులకు ఎంతో ఇష్టమైన మాస్టారు ఆయన. అతి తక్కువ సెలవులు తీసుకుంటూ.. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ఉపాధ్యాయుడు పటోళ్ల రమేశ్. మారుమూల గ్రామమైన మారేపల్లితండాలోని గిరిజన బాలబాలికలకు మెరుగైన బోధన అందిస్తున్నారు. పిల్లలు స్కూల్‌కు రాకపోతే ఇళ్లకు వెళ్లి సమస్యను తెలుసుకుంటారు. చదువు ఆవశ్యకతను వివరిస్తూ తల్లిదండ్రులను సైతం చైతన్యం చేస్తా. తన సొంత డబ్బులు వెచ్చించి. పెన్నులు, నోటు పుస్తకాలు, ప్లేట్లు ఇలా ఏ అవసరం ఉన్నా వెంటనే సమకూరుస్తున్నారు.

– పెద్దేముల్



ఇళ్లకు వెళ్లి పిల్లలను తీసుకువస్తున్న రమేశ్

మార్చే సారు



ఫలించిన టీచరమ్మ కృషి



పాఠశాల గోడలపై మహనీయుల చిత్రాలు గీస్తున్న చంద్రశేఖర్



శ్రీవాణి

పెద్దేముల్ మండలం కర్ణాటక సరిహద్దులోని మారుమూల గిరిజన గ్రామం పాషాపూర్ తండా. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ.. 2017లో ఈ పాఠశాలలో విధులు చేపట్టిన ఉపాధ్యాయురాలు జే.టీ శ్రీవాణి సమస్యను గుర్తించారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు పెయింటింగ్‌లో నైపుణ్యం ఉన్న భర్త చంద్రశేఖర్ సహకారం తీసుకున్నారు. పాఠశాల గోడలపై మహనీయుల చిత్రపటాలు వేయించారు. ఇందు కోసం సొంత డబ్బు ఖర్చు చేశారు. గ్రామంలోని ప్రజలను చైతన్యం చేసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చొరవ తీసుకున్నారు.

– పెద్దేముల్

మీరు వెళ్లొద్దు సారూ..



ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండటంతో కంటతడి పెట్టిన విద్యార్థినులు(ఫైల్)

విద్యార్థులకు పాఠాలు చెప్పడం తోపాటు వారితో మమేకమయ్యారు చౌడాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం తిమ్యా, ఉపాధ్యాయుడు భాస్కర్. గురువులతో పిల్లలకూ విడదీయరాని అనుబంధం ఏర్పడింది. ఈ క్రమంలో జూన్ 25న వీరికి బదిలీ ఉత్తర్వులు అందాయి. దీంతో విద్యార్థులు తల్లడిల్లిపోయారు. సార్.. మీరు వెళ్లకండి అని బోరున విలపించారు. హెచ్‌ఎం తిమ్యా, ఉపాధ్యాయుడు భాస్కర్ వెళుతున్న వాహనాలకు అడ్డుగా వెళ్లి వారిని పట్టుకొని ఏడ్చేశారు. ఈ సన్నివేశం గ్రామస్తులను కంటతడి పెట్టేలా చేసింది.

– కుల్కచర్ల

ఆదర్శం.. ఆంజనేయులు



పాఠాలు బోధిస్తున్న ఆంజనేయులు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వారి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చదివించడం సహజం.. కానీ కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆంజనేయులు తన ఇద్దరు కుమారులు సత్యప్రకాష్, జ్ఞానప్రకాష్‌ను తాను పనిచేస్తున్న స్కూల్‌లోనే చదివించారు. అంతేకాకుండా మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టలేదు. పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించడానికి వేదిక లేకపోవడంతో సొంత డబ్బు రూ.60 వేలు ఖర్చు చేసి స్టేజ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులతో మమేకమవుతూ, నాణ్యమైన బోధన అందేలా కృషి చేస్తున్నారు. విధి నిర్వహణలో తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– కుల్కచర్ల

విద్యా సామర్థ్యాలు పెంచుతూ..



బోధన చేస్తున్న శ్రీనివాస్

రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి.. అంగవైకల్యం తన భవిష్యత్ ముందు ఓడిపోయింది.. 2012 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు గుడిసె శ్రీనివాస్. ప్రస్తుతం మూడుచక్రాల వాహనంపై తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచి, అత్యుత్తమ బోధన అందిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలిగేలా టీఎల్‌ఎంను సొంతంగా తయారు చేస్తున్నాను. ఆటపాటల ద్వారా బోధన చూస్తూ పిల్లల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

– తాండూరు టౌన్

విద్యార్థులతో మమేకం..

కొడంగల్ మండలం అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసిన వీరేశం ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన వెళ్తున్న క్రమంలో మా సార్ మాకే కావాలంటూ అప్పట్లో విద్యార్థుల రోదనలు మిన్నంటాయి. ఉద్యోగులకు బదిలీ అనేది సాధారణ విషయమే అయినా.. విద్యార్థులతో స్నేహితులుగా మసలుకుంటూ వారితో మమేకమై విద్యాబోధన అందించిన ఆయన సేవలు మరువలేనివని విద్యార్థుల తోపాటు వారి తల్లిదండ్రులు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ కార్యాలయం ముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసనలు వ్యక్తం చేస్తూ ధర్నా కూడా చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, పదోన్నతి దృష్ట్యా కరన్‌కోట్‌కు వెళ్లారు.

– కొడంగల్ రూరల్



రోదిస్తున్న విద్యార్థులను సముదాయిస్తున్న ఉపాధ్యాయుడు వీరేశం (ఫైల్)

ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్ది..



అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్‌ఎం శ్రీనివాస్(ఫైల్)

తాండూరు మండలం కోటబాసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి పథంలో నడవడానికి ఆ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ కృషి కారణం. ఆయన పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నప్పుడు 180 మంది విద్యార్థులు ఉండేవారు. వారి సంఖ్య 264కు పెంచడంలో ఆయన పాత్ర ఎంతో ఉంది. దాతల సహకారంతో క్రీడా సామగ్రి, ప్రతి నెలా స్కావేంజర్‌కు జీతం, ప్రతి ఏటా వార్షికోత్సవం, తాగునీటి వసతి, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించారు. చెట్లను సంరక్షించారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేశారు. మండలంలోనే ఉత్తమ పాఠశాలగా కోటబాసుపల్లి ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించారు. కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

– తాండూరు రూరల్

రైతులందరికీ న్యాయం చేస్తాం

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- అప్పాయిపల్లిలో మెడికల్ కళాశాలకు భూములిచ్చిన అన్నదాతలకు సన్మానం



మహిళా రైతుకు పరిహారం చెక్కు, ఇంటి స్థల పత్రం అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, తిరుపతిరెడ్డి

కొడంగల్: మండలంలోని అప్పాయిపల్లిలో నిర్మించనున్న మెడికల్ కళాశాల కోసం భూములు ఇచ్చిన రైతులను బుధవారం పట్టణంలోని కడా కార్యాలయంలో అధికారులు సన్మానించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు ఎకరాకు రూ.10 లక్షల పరిహారం చెక్కులు, 125 గజాల ఇంటి స్థలం పత్రాలు పంపిణీ చేశారు. భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు అర్హతను బట్టి మెడికల్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భూములను ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 51 మంది రైతుల దగ్గర 55 ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిపారు. రూ.5 కోట్ల 50 లక్షల పరిహారం చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిద్ధం చేసిన లే అవుట్‌లో ఇంటిస్థలం ఇస్తున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అనంతరం రైతులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.

దశ మారనున్న అప్పాయిపల్లి

కొడంగల్ మండలం అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో 55 ఎకరాల్లో మెడికల్ కళాశాల, వెటర్నరీ కళాశాలను నిర్మిస్తారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు. నర్సింగ్ కళాశాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.46 కోట్లు విడుదలయ్యాయి. ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇందు కోసం రూ.27 కోట్లు కేటాయించారు. మెడికల్ కళాశాల నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత అప్పాయిపల్లి దశ మారనుంది. అక్కడి భూములకు విలువ పెరుగుతుంది. గ్రామం విస్తరిస్తుంది. ఎంతోమందికి జీవనోపాధి లభిస్తుంది.

క్లుప్తంగా

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఇన్‌చార్జి ఎంఈఓ హరిశ్చందర్‌

దోమ: మండల పరిధి నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మంది టీచర్లకు గురువారం సన్మానం నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంఈఓ హరిశ్చందర్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కేవీఆర్‌ గార్డెన్‌లో మధ్యాహ్నం 12.30గంటలకు అభినందన సభ ఉంటుందని చెప్పారు. ఈ సన్మాన కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని పురస్కారానికి ఎన్నికైన ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దశదిన కర్మకు వెళ్తూ అనంత లోకాలకు..

పూడూరు: బంధువుల దశదిన కర్మ కార్యక్రమాలకు వెళ్తున్న మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మంచన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌, లావణ్య(33) దంపతులు బతుకుదెరువు నిమిత్తం సంగారెడ్డి జిల్లా బుదేరా గ్రామానికి వలస వెళ్లారు. బుధవారం వెంకటేశ్‌ దంపతులు స్వగ్రామంలో బంధువుల దశదిన కర్మకు లావణ్య తండ్రి మన్నే రాంచంద్రయ్యతో కలిసి బయలుదేరారు. మార్గ మధ్యలో పూడూరు గేటు వద్ద వీరు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఒక్కసారిగా టర్న్‌ తీసుకున్నాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న వెంకటేష్‌ బైక్‌ అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో లావణ్య అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్‌, రాంచంద్రయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను వికారాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు

పహాడీషరీఫ్‌: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సూరజ్‌, నీరూన్‌ నిసాన్‌ బీబీ(23) దంపతులు. వీరు ఏడాది క్రితం తుక్కుగూడకు వలసవచ్చి నివాసం ఉంటున్నారు. నెల క్రితం దంపతులు గొడవ పడగా.. భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి ఆమె తన సోదరుడు సికిందర్‌తో కలిసి గత నెల 31న భర్త దగ్గరికి వచ్చింది. ఈ నెల 1 తేదీన బావ, బావమరుదులు పని మీద వెళ్లగా ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంది. రాత్రి వచ్చి చూడగా కనిపించలేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఒడిశాకు చెందిన మీరాన్‌ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

సెంట్రింగ్‌ సామగ్రి చోరీ

శంకర్‌పల్లి: భవన నిర్మాణానికి సంబంధించిన సెంట్రింగ్‌ సామగ్రి చోరీ అయిన సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలోని సార్క్‌ శేషాద్రి వెంచర్‌లో బిల్డింగ్‌ నిర్మించేందుకుగాను సెంట్రింగ్‌ సామగ్రిని మంగళవారం తీసుకువచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో రూ.2 లక్షలు విలువ గల సెంట్రింగ్‌ సామగ్రిని అపహరించుకెళ్లారు. వెంచర్‌ మేనేజర్‌ లక్ష్మణ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

చేవెళ్ల: మానసిక పరిస్థితి సరిగా లేని 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని ఈర్లపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ దస్తగిరి చెల్లెలు ఫరీదాబేగం (16) మానసిక పరిస్థితి బాగాలేదు. ఆమె మంగళవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయింది. అర్ధరాత్రి తన అన్న లేచి చూసేసరికి ఫరీదా బేగం కనిపించలేదు. కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం దస్తగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అభివృద్ధి.. 'కడా'కే పరిమితం

కొడంగల్‌ నియోజకవర్గానికే రూ.5 వేల కోట్ల నిధులు

- వికారాబాద్‌, తాండూరులో భూమి పూజలతో సరి
- పరిగికి చిల్లిగవ్వ విదల్చని వైనం



కడా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కొడంగల్‌ అభివృద్ధిని సమీక్షిస్తున్న అధికారులు(ఫైల్‌)

వికారాబాద్‌: అభివృద్ధి విషయంలో జిల్లావాసులకు నిరాశ తప్పడం లేదు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు కీలకపదవుల్లో ఉండడంతో జిల్లా ప్రజలు అభివృద్ధిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి మంత్రం మాత్రం కడా(కొడంగల్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ అథారిటీ) పరిధి దాటలేదు. సీఎం పర్యటన ఆయన సొంత నియోజకవర్గంతో పాటుగా మిగిలిన మూడు నియోజకవర్గాల్లోనూ తన మార్కు చూపుతారనుకుని భావించారు. అభివృద్ధి మొత్తం నియోజకవర్గానికే పరిమితమైంది. ముఖ్యమంత్రి సొంతజిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు నిధులు రాబట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

రూ.2,949 కోట్లతో లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టు

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన రెండున్నర నెలల తర్వాత సొంత జిల్లాలో పర్యటించారు. ఆయన మొదటి పర్యటనకు ముందే అభివృద్ధికి సంబంధించిన హామీలు, మంజూరీలు పూర్తయ్యాయి. కడా పేరిట నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.5,000 కోట్లపై చిలుకు నిధులకు పనులు మంజూరు చేశారు. ఇందులో ప్రధానంగా రూ.2,949 కోట్లతో లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారు. పంచాయతీ రాజ్‌ రోడ్లు, ఆర్‌ అండ్‌ బీ రోడ్లకు వందల కోట్ల నిధులు మంజూరు చేశారు. వైద్య కళాశాల, నర్సింగ్‌, ఫిజియోథెరపీ, పారామెడికల్‌ కళాశాల మంజూరు, ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెంపు తదితర నిర్ణయాలతో నియోజకవర్గాన్ని అందనంత ఎత్తుకు తీసుకెళ్లారు. ఇంజినీరింగ్‌, మహిళా డిగ్రీ కళాశాల, ఇంటర్‌ కళాశాలలు, అగ్రికల్చర్‌ కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం.. వెనువెంటనే మంజూరు చకచక జరిగింది. పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణ సైతం ప్రారంభించారు. ఈ పనులన్నింటికీ పర్యటనకు వారం ముందుగానే సాంక్షన్లు ఇచ్చారు. ఇవన్నీ కేవలం కొడంగల్‌ నియోజకవర్గానికే పరిమితమవ్వడంతో వికారాబాద్‌, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో అభివృద్ధి ప్రస్తావన సీఎం నోట రాకపోవటంతో జిల్లా వాసులు అసంతృప్తికి గురవుతున్నారు.

నిధులు రాబట్టడంలో విఫలం

జిల్లాలోని నాలుగు నియోజవర్గాల్లో 'హస్తం' పాగా వేసింది. వీరిలో రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి వరించగా.. వికారాబాద్‌ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ కుమార్‌కు సభాపతిగా అవకాశం దక్కింది. పార్టీకి చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి సన్నిహితులే. వీరంతా భారీగా నిధులు తీసుకువచ్చి జిల్లాకు ఖ్యాతి తెస్తారనకుంటే విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్‌లో ఇటీవల ఓ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌ హౌస్‌కు భూమి పూజ చేయగా.. తాండూరులో రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణాలకు శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకొన్నారు. ఇక పరిగిలో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా మంజూరు చేయలేదు. కాగా జిల్లాలోని ఎమ్మెల్యేలు తమ సొంత పనులు చక్కదిద్దుకోవటంపైనే దృష్టి సారించారు తప్ప నియోజకవర్గాల అభివృద్ధి పట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో సీఎంలుగా.. ఇతర కీలక శాఖల్లో ఉన్న వ్యక్తులు తమ జిల్లాలను అభివృద్ధి చేయడంలో సఫలమైన విషయం అందరికి తెలిసిందే. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని ఒప్పించి జిల్లాకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

జ్ఞాన జ్యోతులకు అవార్డులు



కుల్కచర్ల నుంచి ముగ్గురు



మంజుల



దేవులానాయక్‌



పాండు నాయక్‌

కుల్కచర్ల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలను బుధవారం అధికారికంగా విడుదల చేశారు. ఇందులో మండల పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు పురస్కారానికి ఎంపికయ్యారు. కుల్కచర్ల బాలికల పాఠశాల ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌గా పనిచేస్తున్న మంజుల, హన్మానాయక్‌ తండా హెచ్‌ఎంగా పనిచేస్తున్న దేవులానాయక్‌, సాల్వీడ్‌ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పాండునాయక్‌ ఎన్నికవ్వడంతో మండల అధికారులు, ఆయా సంఘాలు సభ్యులు అభినందనలు తెలిపారు.

అగ్గనూరు నుంచి ముగ్గురు



ఎం.మురహరినాథ్‌

యాలాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. అగ్గనూరు పీఎస్‌ హెచ్‌ఎం మొగులయ్య, అగ్గనూరు ఎంపీపీఎస్‌ ఎస్జీటీ ఉపాధ్యాయుడు ఎం.మురహరినాథ్‌, కేజీబీవీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును అందుకోనున్నారు.

హకీంపేట జెడ్పీహెచ్‌ఎస్‌ నుంచి ఇద్దరు



కరుణాకర్‌



హన్మంత్‌

దుద్యాల్‌: మండల పరిధిలోని హకీంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న బి.కరుణాకర్‌ ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడు, ఆర్‌.హన్మంత్‌ పీడీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.దీంతో ఉపాధ్యాయులు వారిని అభినందనలతో ముంచెత్తారు.

పరిగికి నాలుగు పురస్కారాలు



శ్రీనివాస్‌

పరిగి: మండల పరిధిలో పనిచేస్తున్న నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మిట్టకోడూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్‌, పట్టణ కేంద్రంలోని నంబర్‌-1 పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తావుర్య, బిచ్చ, సుల్తాపూర్‌ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రెడ్డిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేస్తూ జిల్లా విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

నాలుగు పాఠశాలల నుంచి నలుగురు



కొండయ్య



ఉమేష్‌



బుచ్చిరెడ్డి



ఫాతిమా బేగం

బంట్వారం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2024 సంవత్సరానికి గానూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా బంట్వారం, కోట్‌పల్లి మండలాల నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో బి.కొండయ్య (టీజీ ఎంఎస్‌, బంట్వారం), సి.ఉమేశ్‌(జెడ్పీహెచ్‌ఎస్‌, రాంపూర్‌), సి.బుచ్చిరెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్‌, కోట్‌పల్లి), ఫాతిమా బేగం(జెడ్పీహెచ్‌ఎస్‌, కోట్‌పల్లి) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

మండపాల వద్ద మద్యం, పేకాట నిషేధం

వికారాబాద్‌ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు: గణేశ్‌ మండపాల వద్ద మద్యం సేవించిడం, పేకాట నిషేధమని వికారాబాద్‌ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌ ఉన్‌ నబీ పండుగల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండపాల వద్ద, నిమజ్జన ఊరేగింపునకు డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. గ్రామ పెద్దలు యవతను కంట్రోల్‌ చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని.. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మండపాలకు జియో ట్యాగ్‌ చేస్తున్నామని చెప్పారు. మండప నిర్వాహకులు పోలీస్‌ పర్మిషన్‌ తప్పక తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌, ట్రాన్స్‌కో మండల ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వినాయకుల ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్తములేరి!

నవాబుపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం ఉత్తమ సేవలందిస్తున్న టీచర్లను గుర్తించి వారికి ఉత్తమ ఉపాధ్యాయుల సర్టిఫికెట్‌లతో సన్మానిస్తారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 39మంది ఉపాధ్యాయులు ఎంపికవ్వగా జిల్లాలోని నవాబుపేట మండలం నుంచి ఒక్క ఉపాధ్యాయుడి పేరు లేదు. ఉన్నత, ప్రాథమిక, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల్లో కలిపి 190 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా ఉత్తమ సేవలు అందించడం లేదా అని మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఎంఈఓ గోపాల్‌ సంప్రదించగా అవార్డులకు ఏ ఒక్క ఉపాధ్యాయుడు దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు.

ఇద్దరు సీఐలు బదిలీ

అనంతగిరి: జిల్లాలో ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారని ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. ధారూరు సీఐగా పనిచేస్తున్న రామకృష్ణ, డీసీఆర్‌బీ సీఐ వెంకటేశంను ఐజీపీ కార్యాలయాలనికి అటాచ్‌ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ధారూర్‌ సీఐగా భీమ్‌ కుమార్‌, డీసీఆర్‌బీ సీఐగా ఆంజనేయులు బదిలీపై వచ్చారన్నారు. కాగా ధారూర్‌ సీఐ భీమ్‌కుమార్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు కబ్జాకు యత్నం



పెద్దఅంబర్‌పేటలో కాలనీలకు వెళ్లే దారికి అడ్డంగా ఏర్పాటు చేసిన భారీ కంటైనర్‌

- అడ్డంగా కంటైనర్‌ ఏర్పాటు
- పనులను అడ్డుకున్న స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: పలు కాలనీలకు వెళ్లే ప్రధాన దారిని కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు యత్నించారు. బుధవారం తెల్లవారుజామున పదుల సంఖ్యలో మహిళా కూలీలతో వచ్చి రోడ్డుకు అడ్డంగా భారీ కంటైనర్‌ను వేయడంతో పాటు రెండు వైపులా ప్రీకాస్ట్‌ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తుండడంతో కాలనీలవాసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మున్సిపల్‌ పరిధిలోని 4వ వార్డులో బృందావన్‌హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో(సంసర్వేనంబర్‌ 175) రోడ్డును వేశారు. దాదాపు 25 ఏళ్ల కావస్తున్నప్పటికీ ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ రోడ్డును కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్‌ అవెన్యూ కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డితో పాటు వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు హయత్‌నగర్‌ సీఐ నాగరాజుగౌడ్‌, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి, ఇరు పక్షాల వద్ద నుంచి పత్రాలను తీసుకున్నారు. వివాదం పరిష్కారమయ్యే వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని సీఐ హెచ్చరించారు. గత మే నెల 25న జాతీయ రహదారి నుంచి కాలనీలకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా జేసీబీతో గుంతను తవ్వడంతోపాటు ఇనుప రేకులు బిగించేందుకు వచ్చిన ఆక్రమణదారులు యత్నించారు. దీంతో స్థానికులు అడ్డుకొని తరమికొట్టారు.

సమైక్యతకు నిదర్శనం గణేశ్‌ ఉత్సవాలు

ఎస్పీ నారాయణ రెడ్డి

- తాండూరులో పీస్‌ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు టౌన్‌: గణేశ్‌ ఉత్సవాలు సమైక్యతకు నిదర్శనమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం తాండూరులోని ఓ హోటల్‌లో డివిజన్‌ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు కన్నుల పండువగా జరిగే గణేశ్‌ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. తాండూరులో హిందూ, ముస్లింలు పండుగలను సమైక్యతతో నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తుందన్నారు. విగ్రహాలను వీలైనంత త్వరగా ఊరేగింపులోకి తీసుకువస్తే, అంతే త్వరగా, ప్రశాంతంగా నిమజ్జనం పూర్తవుతుందని తెలిపారు. సోషల్‌ మీడియాలో వైరల్‌ అయ్యే పుకార్లను నమ్మరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటుచేసుకోకుండా పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరిస్తామని ప్రకటించారు. ప్రతి ఏటా మాదిరిగానే హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు కలిసికట్టుగా ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు హిందూ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షురాలు, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్నా పరిమళ్‌, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు మాట్లాడారు. విగ్రహాల ప్రతిష్ఠాపన రోజు మొదలుకొని నిమజ్జనం వరకు విద్యుత్‌, మున్సిపల్‌, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో మంటపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కమాల్‌ అతర్‌, కౌన్సిలర్‌ సాజిద్‌అలీ, సలీంలు మాట్లాడుతూ.. తాండూరులో హిందూ ముస్లింల మధ్య సోదర భావం నెలకొని ఉందన్నారు. ఇరు వర్గాలు పండుగలను కలిసికట్టుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగేలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు రాజుగౌడ్‌, తహసీల్దార్‌ తారాసింగ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ విక్రమసింహారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్‌, అశోక్‌, ఎక్సైజ్‌, పోలీసు, విద్యుత్‌ శాఖాల అధికారులు, పట్టణ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం

పరిగి: పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలో వివిధ పార్టీల నాయకులు, గణేశ్‌ మండప నిర్వాహకులతో పీస్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి వినాయకులనే పూజిద్దామని పిలుపునిచ్చారు. పరిగి అంటేనే శాంతికి పేరని, 40 ఏళ్ల చరిత్రలో ఎలాంటి గొడవలు జరగకుండా పండుగలు జరుపుకోవడం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌, మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌ కుమార్‌, తహసీల్దార్‌ ఆనంద్‌రావు, ఎస్సై సంతోష్‌ కుమార్‌, విద్యుత్‌ ఏఈ ఖాజా, ఆయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇతరుల వాహనాలకు నో ఎంట్రీ

- ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది వాహనాలకే అనుమతి
- రోడ్డు పైనే నిలుపుతున్న వాహనదారులు
- ఇబ్బంది పడుతున్న జనం

నవాబుపేట: ప్రభుత్వ కార్యాలయాల్లోకి కేవలం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వాహనాలనే అనుమతిస్తున్నారు. వారి కార్లు, బైక్‌లు వచ్చిన వెంటనే గేట్లు మూసేస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చే వారితో పాటు మండల వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయానికి నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు తదితర పనుల నిమిత్తం ప్రజలకు కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడ పార్కింగ్‌ స్థలం లేకపోవడం.. కార్యాలయంలోనికి ఇతరుల వాహనాలు అనుమతించకపోవడంతో వారు రోడ్డు పక్కనే వాహనాలు నిలిపి వెళ్తున్నారు. తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట పోలీస్‌స్టేషన్‌ ఉంటుంది. వారి వాహనాలు సైతం రోడ్డు పక్కనే పార్క్‌ చేయడంతో ప్రధాన రోడ్డు ఇరుకుగా మారుతోంది. ఈ మార్గం మీదుగా నిత్యం 40 ఆర్టీసీ సర్వీసులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తహసీల్దార్‌ కార్యాలయం పోలీస్‌స్టేషన్‌ సమీపంలో ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను కార్యాలయ ఆవరణలోకి అనుమతించడం లేదంటే పార్కింగ్‌ స్థలమైనా చూపాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కనే నిలిపిన కార్లు , ఇతరుల వాహనాలు రాకుండా మూసేసిన తహసీల్దార్‌ కార్యాలయం గేటు

పంట పొలాల్లో నీటి నిల్వలు తొలగించాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



రుద్రారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని టేకుల్‌కోడ్‌, రుద్రారం తదితర గ్రామా ల్లో పర్యటించారు. మొక్కజొన్న, పత్తి, వరి పంటలను ఏడీఏ కె.శంకర్‌రాథోడ్‌, వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు అందించారు. పంట పొలాల్లో మొక్కల సాళ్ల మధ్య నీరు నిల్వకుండా బయటకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాలతో పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందని.. దీన్ని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ లేదా 19.19.19 లీటర్‌ నీటిలో కలిపి పిచికారి చేయాలని, పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన అనంతరం 25కిలోల యూరియా 10 కిలోల పొటాష్‌ ఎరువులను మొక్కకు 5 సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలని తెలిపారు. అధిక తేమతో పత్తి వేరుకుళ్లు సోకడానికి అవకాశం ఉన్నందున మూడు గ్రాముల కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ లీటర్‌ నీటికి కలిపి తెగులు సోకిన పాదుల చుట్టూ నేలపై వారం రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పోసి నివారించాలన్నారు. మొక్కజొన్న పంటలో అధిక తేమ వలన భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఊదా రంగులోకి మారే అవకాశం ఉందని.. వర్షాలు నిలిచాక 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్‌ 10గ్రాములు లీటరు నీటికి కలుపుతూ మొక్కలకు పిచికారి చేయాలని సూచించారు. కత్తెర పురుగు సమస్య ఎక్కువగా ఉంటే క్లోరంట్రానిలిప్రోల్‌ 0.4మి.లీ లేదా స్పైనటోరం 0.5మిలీ కలిపి ఆకుల సుడులు తడిచేలా పిచికారి చేయాలని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటల సస్యరక్షణ చర్యలు చేపడుతూ అధిక దిగుబడులు పొందేందుకు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజు రాథోడ్‌, శ్రీపతిరెడ్డి, ఇసాక్‌, దేవేందర్‌, వసీమ్‌, పావని తదితరులు పాల్గొన్నారు.

రైతులు సూచనలు పాటించాలి

అనంతగిరి: వర్షాలకు పంటలు పాడవ్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌ టి.లక్ష్మణ్‌, శాస్త్రవేత్త సి.యమున పలు సూచనలిచ్చారు. మొక్క జొన్న, పత్తి, వరి పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసి పంటలు కాపాడుకోవాలన్నారు.